క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీ హెచ్‌బీ కాలనీ, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్ 1,2,3, రాడిసన్ హోటల్, క్వయట్‌లాండ్ విల్లాస్, గచ్చిబౌలి ఫ్లైఓవర్ పరిసరాలు, హిమగిరి హస్పిటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్విమ్మింగ్ పోటీలకు బీహెచ్ ఈఎల్ భవన్స్ విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: జిల్లా స్థాయి స్విమ్మింగ్ అండర్(14–17) బాలబాలికల పోటీలలో భవన్స్ బీహెచ్‌ఈఎల్, టౌన్‌షిప్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ విద్యార్థులు అక్టోబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో సంగారెడ్డి డీఎస్సీ స్విమ్మింగ్ పూల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. అండర్ –14 కేటగిరీలో శుభాంగ్, ఆలియాఫాతిమా, ఎండీ నాజీర్, గీతిక, సాహితీ పలు విభాగాలలో మొదటిస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేబోలు ఉమ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, పీఈటీ , ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం అన్నమస్వరార్చన కార్యక్రమంలో భాగంగా ఇందిరా మయూరి డాన్స్ అకాడమీ గురువు యుక్తారెడ్డి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. అనంతరం డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్ల ఎంపిక

పటాన్‌చెరు టౌన్: ఉమ్మడి మెదక్ జిల్లా.. అండర్ –14 క్రికెట్ బాలుర, అండర్ –17 బాలికల జట్ల ఎంపిక ప్రక్రియను శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ పూర్తి చేశారు. ఎంపికలో భాగంగా 200 మంది క్రీడాకారులు పాల్గొనగా 16 మంది బాలికలను, 16 మంది బాలురను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్ నర్సింహ, పీఈటీలు శ్రీనివాసగౌడ్, నాగరాజ్, శివకుమార్, రమేశ్, రాజాగౌడ్, రవి, కరుణాకర్, రామరాజు, సంతోష్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

సీఐటీయూని గెలిపించండి

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సంక్షేమం కోసం పాటుపడే సీఐటీయూని త్వరలో నిర్వహించనున్న కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని అగర్వాల్ రబ్బర్ పరిశ్రమలో వచ్చేనెల 3న జరిగే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల సందర్భంగా పరిశ్రమ ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పరిశ్రమల్లో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం పని చేస్తున్న సంఘం సీఐటీయూ అని తెలిపారు. చుక్క గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, రాజు, శ్రీనివాస్, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించండి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కౌన్సిలర్ చంద్రారెడ్డి సూచించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి శనివారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్‌లో పక్షులను వీక్షిస్తున్న పక్షి ప్రేమికులు

అరుదైన పక్షుల వీక్షణం

పక్షి ప్రేమికుల కోసం బర్డ్ వాక్

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో అరుదైన పక్షులను పక్షి ప్రేమికులు వీక్షించారు. శనివారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ ఏర్పాటు చేసింది. రోజ్–రింగ్డ్ పారాకీట్, రూఫస్ ట్రీ పై, ఇండియన్‌రాబిన్, ఎల్లో–బిల్డ్ బాబ్లర్, పర్పుల్ సన్బర్డ్, భారతీయ సిల్వర్‌బిల్, ఆసియా గ్రీన్ బీ–ఈటర్, నవ్వుతున్న పావురం, మచ్చల పావురం, పైడ్బుష్చాట్, తెల్లటి బుగ్గల వాగ్ టైల్, లేత బిల్డ్ ఫ్లవర్ పేకర్ వంటి అరుదైన పక్షులను వీక్షించారు. టీఎస్‌ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ మాట్లాడుతూ పక్షులను అధ్యయనం చేస్తూ 15 వేల మంది ఔత్సాహికులు అందించిన వివరాల ఆధారంగా ద స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్ వివరాలను వెల్లడించిందన్నారు. 867 రకాల పక్షుల స్థితిగతులను అందించారని, గద్దలు, రాబందులు, పాగే పక్షులు, తీరాలకు వలస వచ్చే పక్షుల సంఖ్య అత్యధికంగా తగ్గిందని నివేదిక ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పక్షుల వేట, పక్షుల అవాసాలు లేకుండా చేయడమే పక్షుల జాతులు అంతరించి పోతున్నాయని అన్నారు. నాలుగు బృందాలుగా విభజించి పక్షుల వీక్షణ ఏలా చేయాలి, వాటిని ఎలా గుర్తించాలి, అవి ఎలాంటి శబ్దాలు చేస్తాయనే విషయాలపై అవగాహన కల్పించారు. నగరంలోని పలు చోట్ల నుంచి 30 మంది, 44 మంది జంతు శాస్త్రం విద్యార్థినులు, 74 మంది పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ డైరెక్టర్ అక్బర్, ఏడీ డాక్టర్ జి.సైకిలాబ్, మేనేజర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.







బొటానికల్ గార్డెన్‌లో విహరించిన అరుదైన పక్షులు

జాషువా తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు శ్లాఘనీయం

రాయదుర్గం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు శ్లాఘనీయమని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్(బీఎస్ఎఫ్–హెచ్‌సీయూ) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నవయుగ కవి గుర్రంజాషువా 128వ జయంతి వేడుకలను గచిబౌలిలోని హెచ్‌సీయూలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'జాషువా కవిత్వంలో దేశభక్తి' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ సామాజిక అభ్యుదయం కోసం ఆయన పాటుపడిన అంశాలను వివరించారు. అనంతరం తెలుగు సాహిత్యానికి ఆయన అందించిన సేవలను ఆచార్యులు పిల్లలమర్రిరాములు, ఆచార్య బాణాల భుజంగరెడ్డి, జాషువా కవిత్వంలో దళిత బహుజన తత్వంపై కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, జాషువా సాహిత్యంలో దార్శనికత అనే అంశంపై కవయిత్రి, కేంద్రీయ సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత మానస యండ్లూరి, జాషువా సాహిత్యంలో ప్రాపంచిక దృక్పదం అనే అంశంపైటి గురుకుల డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ భారతి ప్రసంగించారు. పరిశోధక విద్యార్థి గుంటి రోహిత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఎస్ఎఫ్ ప్రతినిధులు, పలువురు హెచ్‌సీయూ విద్యార్థులు పాల్గొన్నారు.



గుర్రంజాషువా జయంతి వేడుకలో పాల్గొన్న ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,తదితరులు

నేడు హెచ్‌సీయూలో 'ఏక్ తారీఖ్....ఏక్ ఘంటా'

రాయదుర్గం: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశంపై ఆదివారం (అక్టోబర్ 1వ తేదీన) 'ఏక్ తారీఖ్ ఏక్ ఘంటా' పేరిట 'స్వచ్ఛతా హి సేవా అభియాన్–2023' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, సిబ్బంది, అధికారులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు కృషి చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీయూలోని ఎన్ఎస్ఎస్ విభాగం, హార్టికల్చర్ విభాగం, శానిటేషన్ విభాగంతో కలిసి నిర్వహించాలని తలపెట్టారు. ఈ కార్యక్రమం కోసం హెచ్‌సీయూ మూడు స్థలాలను ఎంపిక చేశారు. హెచ్‌సీయూలోని మేయిన్ గేట్, స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, టీఎస్ఆర్టీసీ కొత్త బస్టాప్, యూనివర్శిటీ ప్రధాన గేటు వెలుపల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా ఉన్న స్థలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు

మియాపూర్ : నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో రూ.20లక్షల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే సిడిపి ఫండ్స్ నిధులతో నూతనంగా చేపట్టబోయే కమ్యూనిటీ భవనం నిర్మాణం పనులకు కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్‌ను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. కాలనీల అభివృదికి విశేషంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయం డైరెక్టర్ గణేష్, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, మియాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ గౌరవ అధ్యక్షులు గంగాధర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత ప్రాతిపదికన చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్ లోని గోపాల్‌రెడ్డినగర్, హనీఫ్‌కాలనీలో రూ.45 లక్షలతో, శేరిలింగంపల్లి డివిజన్ సెంట్రల్ పార్కు ఫేజ్–1కాలనీలోరూ. 45 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులకు ఆయన కార్పొరేటర్లు హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించడంతో పెద్ద ఎత్తున శేరిలింగంపల్లిలో కోట్లాదిరూపాయలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టి ఇప్పటికే చాలా చోట్ల పనులు పూర్తి చేశామన్నారు. ఇప్పటికీ అవసరమైన చోట్ల పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రాజశేఖర్, మేనేజర్ సందీప్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.

మంజీరా పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

హఫీజ్‌పేట్: మాదాపూర్‌డివిజన్‌లోని సంకల్ప్ అపార్ట్‌మెంట్స్‌కాలనీలో రూ.2.10 కోట్ల వ్యయంతో చేపట్టే మంజీరామంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

ఈ పదేళ్లలో అభివృద్ధి పరుగులు

జిన్నారం(పటాన్‌చెరు): సొంతింటి కలను సాకారం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం పథకాలను అమలు చేస్తున్నారని, 65 ఏళ్లుగా రాష్ట్రంలో జరగని అభివృద్ధి కేవలం పదేళ్లలో వేగంగా జరుగుతోందని వెల్లడించారు. శనివారం జిన్నారం మండలంలోని మాదారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 3 వేల మందికి గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని వీరందరూ ఈ పథకానికి అర్హత పొందారన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలను మహిళలకు అందించటం సంతోషంగా ఉందన్నారు. నిరంతర ప్రక్రియగా ఈ పథకం కొనసాగుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పథకాలను అందించేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. సొంతింటి కలను సాకారం చేసేందుకు డబుల్ బెడ్ రూం పథకంతోపాటు నిరుపేదలకు స్థలాలను కూడా అందిస్తున్నామని చెప్పారు. గృహలక్ష్మి కింద రూ.3లక్షలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సర్కారు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోసారి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఆకట్టుకున్న వినూత్న కళా ప్రదర్శన







సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మాదాపూర్ 'గ్యాలరీ 78' వేదికగా శనివారం ఏర్పాటు చేసిన రిసనేటింగ్ నరేటివ్స్ చిత్ర ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విభిన్న దారాలతో క్రోసియా వర్క్‌తో రూపొందించిన ఈ చిత్రాలు వినూత్న కళాత్మకతను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా ఆర్టిస్ట్ మానసా ప్రియ దూళిపాల మాట్లాడుతూ., చిన్నారుల తన్మయత్వం, తల్లీబిడ్డల మధ్య ఆత్మీయత వంటి సున్నితి అంశాలను తన చిత్రాల ద్వారా రూపొందించానని తెలిపారు. తల్లీబిడ్డల మధ్య అనుబంధాన్ని, మాధుర్యాన్నీ కళాత్మకంగా వర్ణించడం గొప్ప అనుభూతినిచ్చిందని ఆమె అన్నారు. సాధారణమైన చిత్రకళకు ఈ క్రోసియా వర్క్ వినూత్నత్వాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అమన్ ప్రీత్ కౌర్, దీపాంజలీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. శనివారం సెలవురోజు కావడంతో చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా యాంఫిథియోటర్‌లో తేజస్వీ కొండూరిచే భరతనాట్య ప్రదర్శన, గుజరాతి రసగర్భ నృత్యాలు, గురువు రాధామోహన్ శిష్యబృందంచే రాధామోహనం, శ్రీకృష్ణుడి బాల్యలీల, యుక్తవయస్సు రాదాగోపికలతో రాసలీలలు, రాధాకృష్ణుల ప్రేమామృత విలువల గురించి భరతనాట్య నృత్య పద్దతిలో కళాకారులు ప్రదర్శించి అలరించారు.

పీసీబీ అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమల్లో పీసీబీ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో వ్యర్థ జలాలను బయటికి వదులుతున్నారనే ఫిర్యాదులు రావటంతో అధికారులు వ్యర్థ జలాల నమూనాలను సేకరించారు. నమూనాల పరీక్షల అనంతరం పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

దోమలే... దోమలు ..

- చెరువుల్లో కప్పేస్తున్న గుర్రపు డెక్క
- మురుగు నీటితో నిండిపోతున్న చెరువులు
- కాలనీలు, చెరువు చుట్టు పక్కల ప్రాంతాల్లో అపరిశుభ్రత
- దోమలు వృద్ధి చెంది విష జ్వరాల భారీన ప్రజలు



పటేల్ చెరువులో మురుగు, గుర్రపుడెక్క పేరుకుపోయిన దృశ్యాలు



నాయినమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క దృశ్యాలు

మియాపూర్ : చెరువులు, కుంటలు కలుషితమై దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అండర్ డ్రైనేజీ, మురుగు, వ్యర్థ జలాలు ఇలా అన్నీ చెరువుల్లోకి చేరిపోతున్నాయి. ఓ వైపు గుర్రపు డెక్క పెరగడం, మరో వైపు చెరువు పరిసరాల్లో వ్యర్థాలు పడేయడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిసరా ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. పలు కాలనీల్లో మురుగు నీరు నిలిచి రోడ్లపై ప్రవహిస్తోంది. చెరువులు, నాలా పరివాహక ప్రాంతాల వాసులు కంటి మీద కునుకు లేకుండా దోమలు ఎడపెడ చేస్తున్నాయి. మియాపూర్ గురునాథం చెరువు, పటేల్ చెరువు, రామ సముద్రం చెరువు, మక్తమహబూబ్‌పేట్ చెరువు, రేగుల కుంట చెరువు, నాయినమ్మ కుంట చెరువు, కిందికుంట చెరువులన్నీ కలుషితమయ్యాయి. చెరువులోకి మురుగు నీరు చేరి గుర్రపు డెక్క పెరిగి చెత్త, చెదారం మురుగు నీటితో నిండి దోమలకు నిలయంగా మారుతున్నాయి.

- ఏటా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించేందుకు లక్షల రూపాయలు వెచ్చిస్తున్న ఆశించిన ఫలితం నేరవేరడం లేదు. చెరువుల్లో మురుగు నీరు చేరకుండా చెరువులను సుందరీకరిస్తామన్నా ప్రజాప్రతినిధులు, అధికారుల మాటలు నీటి మీద రాతలయ్యాయి.
- చెరువుల్లో ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు అధికంగా ప్రభలుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. నాలాలు, చెరువులలో ఫాగింగ్ చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల కాలనీల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి.
- మియాపూర్ డివిజన్‌లో పటేల్ చెరువు సుందరీకరణ పనులు ఐదేళ్ల క్రితం చేపట్టారు. నేటికీ సగభాగం కూడా పూర్తి కాలేదు. కనీసం చెరువుల్లో మురుగు చేరకుండా చర్యలు కూడా తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టు ప్రక్కల కాలనీల నుండి మురుగు నీరంతా చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. వీటితో పాటు డివిజన్ పరిధిలోని మిగతా చెరువులను కూడా అభివృద్ధి పేరుతో చెరువు కట్టలు వేసి వదిలేశారు. చెరువుల్లో గుర్రపు డెక్క, మురుగు నీరు చేరుతోంది.
- దోమల వృద్ధిని అరికట్టేందుకు గతంలో డ్రోన్ యంత్రాల సహాయంతో చెరువుల్లో దోమల నివారణ మందులు పిచికారి చేస్తున్నారు. దీని వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చెరువులో దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో చెరువుల్లో దోమలు వృద్ధిచెంది కాలనీ వాసులకు కునుకులేకుండా చేస్తున్నాయి. ఇప్పుడు దోమల ద్వారా వస్తున్న విషజ్వరాలు భయాందోళన కలిగ్తిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు,నాలా పరిసరాల ప్రాంతాల్లో నివాసముండే వారు పొరపాటునా సాయంత్రం, రాత్రి పూట తలుపులు, కిటికీలు తెరిస్తే ఇక అంతే సంగతులు.

తూ.తూ. మంత్రంగా ఫాగింగ్

వర్షాకాలం వచ్చింది అంటే చాలు చెరువులు, కుంటల పక్కన నివాసముండే ప్రాంతాల ప్రజలకు కంటినిండా కునుకులేకుండా పోతున్నది. ముఖ్యంగా ఈ కాలంలో విజృంభించే దోమలతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాదులు ప్రబలి ఆసుపత్రుల పాలై ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారు. చందానగర్ సర్కిల్ 21 పరిధిలో నాలుగు డివిజన్‌లు ఉన్నాయ. అయితే దోమల నివారణ చర్యలు కోసమని పాగింగ్ చేసేందుకు రెండు వాహనాలు అందుబాటులో ఉన్న ఒక్క మాన్యువల్ యంత్రంతోనే పనులు కొనసాగిస్తున్నారు.


టెన్నిస్ ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభం



హైదరాబాద్ ఓపెన్‌టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: హైదరాబాద్ ఓపెన్ టోర్నమెంట్‌ను సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. శనివారం మాదాపూర్‌లోని ఎస్‌వీకె టెన్నిస్ అకాడమీలో 14వ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను టెన్నిస్ ఆడి ఆయన ప్రారంభించారు. పురుషుల సింగిల్స్, డబుల్స్ ఈవెంట్లలో 30,40,50,60,70 వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా, మహిళలు ఓపెన్ విభాగంలో పోటీ పడనున్నారు.దేశవ్యాప్తంగా 451 మంది క్రీడాకారులు పాల్గొంటారని, అక్టోబర్ 2న ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ నంద్యాల నర్సింహా రెడ్డి తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేసినట్లు వివరించారు. సింగిల్స్ విభాగంలో 303 మంది, డబుల్స్‌లో 149 మంది బరిలోకి దిగుతున్నారని పేర్కొన్నారు. విజేతలకు ఐదు లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ డీసీపీ ప్రదీప్, పీవీ రావు, హరి కృష్ణా రెడ్డి, ఏఆర్‌రావు, సదాశివారెడ్డి, లగ్గాని శ్రీనివాస్, అనురుధ్, జెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తాం



రాయదుర్గం: ప్రజాసేవే లక్ష్యంగా, ప్రజలే కుటుంబంగా భావిస్తూ పనిచేస్తామని సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ లోని రాయదుర్గం వార్డు కార్యాలయంలో సందయ్యమెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించి 400 మందికి కంటి అద్దాలను శనివారం పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను దోచుకు తినే ప్రభుత్వాలు పోయి ప్రజా రంజక ప్రభుత్వాలు రావాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించారని ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.